క్లుప్తంగా

ఆధునిక పద్ధతుల్లో సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఎఫ్టీ నాంచారమ్మ

నింద్ర: ఆధునిక పద్ధతుల్లో వరి సాగు చేయడంపై రైతులకు ఎస్ఎఫ్టీ నాంచారమ్మ అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని అగరం రైతు సేవా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ రైతులు వరి సాగులో ప్రత్యామ్నాయ విధానాలను అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తడి– పొడి మట్టిని వినియోగిస్తే మంచిదని వెల్లడించారు. మార్కెటింగ్ అధికారి పైజూనిషా, రాజా, ఏఓ తులసీరాం, వ్యవసాయ సిబ్బంది దివ్య, ప్రియా, చంద్రకాంత్, సంపత్, రమేష్ పాల్గొన్నారు.

అభ్యసనా సామగ్రి పంపిణీ



అభ్యసనా సామగ్రి అందజేస్తున్న సిద్ధయ్య

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సిద్ధయ్య అభ్యసనా సామగ్రి పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమై 253 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు అందజేశారు. పేదల పిల్లల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన చెప్పారు.

కాణిపాకంలో సినీ నటి రమ్యకృష్ణ



రమ్యకృష్ణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని బుధవారం సినీ నటి రమ్యకృష్ణ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన సేవ కార్యక్రమాలను దగ్గర ఉండి చూశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. సిబ్బంది వాసు, బాలాజీ ఆమెకు చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రాష్ట్ర ఫుడ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న దేవి గంజిమల

పూతలపట్టు(యాదమరి): రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి గంజిమల పూతలపట్టు ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆమె మండలంలో పలు సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆమె మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. విద్యార్థులకు సరైన మోతాదులో ఆహారాన్ని అందించకపోవడాన్ని ఆమె గుర్తించారు. దీంతో వంట నిర్వాహకులతో, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులుపై మండిపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వారికి సూచించారు. నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాలను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు ఆదేశించారు. పిల్లలతో పాటు ఆమె కూడా భోజనం చేస్తూ కాసేపు ముచ్చటించారు. అనంతరం అంగన్వాడీ పాఠశాలను, రేషన్ షాపులలో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎస్డబ్ల్యూ నాగేశ్వరరావు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అయ్యోర్లకు వేతన వెతలు!

- బదిలీలు.. ఉద్యోగోన్నతి పొందడమే శాపంగా మారిన వైనం
- రెండు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- పొజిషన్ ఐడీ ఊసే ఎత్తని ప్రభుత్వం
- ఈ నెల జీతం జమ కావడమూ అనుమానమే
- ఆర్థిక ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు

పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆకలి కష్టాలను అనుభవంలోకి తెస్తోంది. విద్యాబుద్ధులు నేర్పించే గురువులకు ఆర్థిక ఇక్కట్లను పరిచయం చేస్తోంది. అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని ఊదరగొట్టిన కూటమి సర్కారు.. ఇప్పుడు నిస్సిగ్గుగా చేతులెత్తేస్తోంది. పైగా, పిల్లల ఉన్నత భవితకు శ్రమించే టీచర్లకు బోధనేతర పనులు అప్పగించి వేధిస్తోంది. ప్రధానంగా ఇటీవల బదిలీలు.. ఉద్యోగోన్నతులు పొందిన వారికి పొజిషన్ ఐడీ జారీ చేయకుండా వేదనకు గురిచేస్తోంది. ఇప్పటికే రెండు నెలలుగా వేతనాలు అందించకుండా అప్పుల పాలు చేసేసింది. ఈ మాసం సైతం జీతం జమ చేసే అవకాశాలను దూరం చేస్తోంది.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు (ఫైల్)

నగరి: నియోజకవర్గంలో 302 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 220 మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు అందడం లేదు. గతంలో రెగ్యులర్గా జీతాలు తీసుకున్నప్పటికీ బదిలీలు, ఉద్యోగోన్నతి పొంది మరోస్థానానికి వెళ్లిన వారికి పొజిషన్ ఐడీ కేటాయించాల్సి ఉంది. ఈ ఐడీ ఉంటేనే వారి వివరాలు సీఎఫ్ఎంఎస్లో కనబడతాయి. అప్పుడు మాత్రమే వారికి జీతాలు చెల్లించడానికి అవకాశముంది. సాధారణంగా వేతనాల బిల్లులు ప్రతి నెల 25వ తేదీలోపు సీఎఫ్ఎంఎస్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే ఇంతవరకూ పొజిషన్ ఐడీ కేటాయించకపోవడంతో ఈ నెలలో కూడా జీతం అందే పరిస్థితి లేదు. పురపాలక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వేరే ప్రాంతానికి వెళ్లి ఉంటే వారి ట్రెజరీ ఐడీలు మారడంతో వేతనాలు పొందే అవకాశం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు, అడ్వాన్సులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు.

యాప్లతో ఇక్కట్లు

పాఠశాల విద్యాశాఖలో ఉన్న యాప్లన్నింటినీ ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి లీప్ (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) యాప్ను రూపొందించారు. ఆ యాప్లోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పీటీఎం అంటూ 30 నుంచి 40 యాప్లను ఉంచారు. అయితే టీచర్ అటెండెన్స్ యాప్ సర్వర్ సరిగా పని చేయక పోవడంతో ఆన్లైన్లో ఫొటో హాజరు నమోదు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలస్యమవుతోంది. అలాగే మధ్యాహ్న భోజనం నిమిత్తం పాఠశాలలకు అందించిన బియ్యాన్ని ఉపాధ్యాయులు పరిశీలించి బస్తాలపై ఉన్న క్యూఆర్ కోడ్ను స్కానింగ్ చేసి ఆన్లైన్లో నమోదు చేయాల్సి ఉంటుంది. బస్తా తెరిచిన ప్రతి సారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఇన్ని యాప్లను రూపొందించిన అధికారులు, పాలకులు పొజిషన్ ఐడీలను కేటాయించి జీతాలు అందించడంలో జాప్యం వహిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై ఈ నెల 2వ తేదీన జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లోనూ, కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపాయి.



జీతాలు చెల్లించాలి

ఇటీవల ఉద్యోగోన్నతులు, బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు అందక తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, ఈఎంఐలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా పొజిషన్ ఐడీ కేటాయించకపోవడం దారుణం. అలాగే ప్రతి అంశాన్ని ఆన్లైన్లో అప్లోడు చేయాలని వెరీ అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజ్లు పెట్టడం ద్వారా ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.

–మునిరత్నం, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు, నగరి

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ హేమలత

పాలసముద్రం (కార్వేటినగరం): విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంతో ముందుకెళ్లాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ శిరీష అన్నారు. బుధవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్..ఈగల్ క్లబ్...తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీఐతోపాటు ప్రిన్సిపాల్ మాట్లాడారు. లైంగిక వేధింపులు, సైబర్ నేరాల బారిన పడితే ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. విద్యార్థులు ఇలాంటి విషయాల్లో పూర్తి స్థాయిలో చైతన్యవంతులై ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షణ్ముగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు వరలక్ష్మీ వ్రతం

వెదురుకుప్పం: వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో డీఆర్ఎస్కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అండగా నిలుస్తూ.. భరోసా కల్పిస్తూ..!



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



నగదు అందిస్తున్న వైఎస్సార్సీపీ నేతలు

అధికారంతో సంబంధం లేదు. పదవులతో పనిలేదు. నమ్ముకున్నవారికి న్యాయం చేయాలి. కష్ట సమయంలో అండగా నిలవాలి. నేతల నుంచి కార్యకర్తల వరకు భరోసా కల్పించాలి. ఇదే లక్ష్యంతో మాజీ మంత్రి ఆర్కే రోజా ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. వారికి చిన్నపాటి ఇబ్బంది వచ్చినా చేయూతనందిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం పలువురు నాయకులను పరామర్శించారు. నేనున్నానంటూ భరోసా కల్పించారు. కార్యకర్త కర్మక్రియలకు ఆర్థిక సాయం అందించారు.

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు.పుత్తూరు మండలం ఉత్తరపు కండ్రిగ వైఎస్సార్సీపీ బూత్ కమిటీ మెంబర్ రవి కుమారుడు విమల్రాజ్(18) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. బుధవారం గ్రామానికి ఆర్కే రోజా వెళ్లి విమల్రాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు.



నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న ఆర్కే రోజా

కర్మక్రియలకు సాయం

పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త సురేష్ (చెంగారెడ్డి) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి ఆర్ రోజా బుధవారం కర్మక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని స్థానిక వైఎస్సార్సీపీ నేతలు భాస్కర్యాదవ్, వినోద్, నవీన్యాదవ్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు.

వైఎస్సార్సీపీ నేతకు పరామర్శ

నగరి: మండలంలోని బుగ్గ అగ్రహారంలో ఇటీవల తీవ్ర అనారోగ్యం పాలై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్సీపీ నేత నరసింహారెడ్డిని మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఆయన ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా పార్టీ తరపున అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లీ, ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, వైఎస్సార్సీపీ నేతలు సత్య, బుజ్జిరెడ్డి, కుమారస్వామి, హరినాథరెడ్డి, గణపతి శెట్టి, మునస్వామి, చంద్రారెడ్డి, గురుమూర్తి, రంగనాథం, ధీరజ్ రెడ్డి, దామునాయుడు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న డీవైఈఓ మహేశ్వరరావు

పుత్తూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని పుత్తూరు డీవైఈఓ మహేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో డివిజన్ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. సిలబస్ను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో షైనింగ్ స్టార్స్గా ఎక్కువ మంది ఎంపికయ్యేలా బోధనలు ఉండాలన్నారు. ప్రతి మండలానికి ఇద్దరు నోడల్ ప్రధానోపాధ్యాయులను నియమించినట్లు వెల్లడించారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే భుజించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

మాకు సెల్ఫోన్లు వద్దు..!

- స్పష్టం చేసిన అంగన్వాడీ వర్కర్లు
- తీసుకునేందుకు నిరాకరించిన అధికారులు
- బాక్సులో సెల్ఫోన్లను పెట్టి వదిలించుకున్న వైనం!



సెల్ఫోన్లను కార్యాలయంలో అప్పగిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కార్వేటినగరం: విధులకు ఇబ్బంది కలిగించే ఫోన్లు తమకు వద్దని..తాము రికార్డులతోనే సమాచారం ఇస్తామని సీఐటీయూ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మమత అన్నారు. బుధవారం కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాలకు చెందిన అంగన్వాడీ సిబ్బంది సెల్ఫోన్లను కార్యాలయంలో అప్పగించారు. వారు మాట్లాడుతూ, తమ కార్యకలాపాలను ఇక నుంచి రికార్డుల ద్వారా మాత్రమే సమాచారం ఇస్తామని, ఫోన్లలో ఇవ్వలేమని తెగేసి చెప్పారు. ఎలాంటి ఉపయోగం లేని డేటాలను అప్పగించి తమపై పనిభారం పెంచడం దారుణంగా ఉందన్నారు. చిన్న పిల్లలతో ఇబ్బందులు పడుతూ వారి ఆలనా పాలనతో పాటు విద్యాబుద్ధులు నేర్పించే అంగన్వాడీ సిబ్బందికి యాప్లతో నరకాన్ని చూపిస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో నెట్వర్క్ సమస్యలు ఉన్నాయని, దీంతో అక్కడి సిబ్బంది యాప్లలో సమాచారం ఇవ్వలేక పోతున్నారన్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా ప్రభుత్వం తమను వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. వేతనానికి తగ్గ పనులు మాత్రమే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం సెల్ఫోన్లను అప్పగిస్తే తీసుకోవడానికి అధికారులు నిరాకరించడంతో వాటిని బాక్స్లో వేసి కార్యాలయంలో పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ, లక్ష్మీనరసమ్మ, పలువురు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తెప్పోత్సవం.. భక్తజన పారవశ్యం





ఊరేగుతున్న కోదండరామస్వామి, స్కంధ పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న సీతారాములు

- పురవీధుల్లో ఊరేగిన సీతారాములు

కార్వేటినగరం: స్థానిక సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో బుధవారం తెప్పోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆలయ ఆవరణలోని సీతా సమేత శ్రీ కోదండరాముల వారిని వేకువ జామున సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్ను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీసీతాకోదండరాముల ఉత్సవ విగ్రహాలతో పాటు లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు వేద పండితులు పంచామృతం, సుగంధ ద్రవాలతో తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి, పుర వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం స్కంధ పుష్కరిణిలో తెప్పపై స్వామివారిని ప్రతిష్ఠించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వేడుకగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్కుమార్, వేద పండితులు శబరీష్, రమేష్, గోపాలాచారి, షరాబ్ బాబు సురేష్, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలు సమాప్తం



ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రుని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. అంతకు ముందు స్వామి, అమ్మవారు పల్లకి ఉత్సవంలో పురవీధుల్లో విహరించారు. సాయంత్రం భద్రకాళీ అమ్మవారితో వీరభద్రుడు పల్లకిని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

హుండీ ఆదాయం రూ.3.48 లక్షలు

ఏర్పేడు: గుడిమల్లంలోని పురాతన శైవక్షేత్రం శ్రీఆనందవల్లీ దేవి సమేత పరశురామేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.3,48,126 వచ్చినట్లు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి తెలిపారు. జూన్ 18వ తేదీ నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు భక్తులు హుండీలో కానుకలుగా సమర్పించిన నగదును బుధవారం లెక్కించినట్లు ఆయన పేర్కొన్నారు.

వర్క్ఆర్డర్ ఉంటేనే..లేదంటే..!

- టిప్పర్ల నుంచి ఎర్రమట్టి అన్లోడ్ చేయించిన తహసీల్దార్



వర్క్ ఆర్డర్ లేకుండా ఎర్రమట్టి తీయడానికి వచ్చిన టిప్పర్లు

పాలసముద్రం (కార్వేటినగరం): అనుమతి లేకుండా పాలసముద్రం మండలంలో ఎర్రమట్టి గ్రావెల్ తీయరాదని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ తమిళనాడు సరిహద్దులో వర్క్ ఆర్డర్ లేకుండా ఎర్రమట్టి గ్రావెల్ తీస్తున్నారని తహసీల్దార్కు ఫిర్యాదు అందడంతో వీఆర్ఓ వెంకటాచలంతో కలిసి ఆ ప్రదేశానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉన్నా వర్క్ ఆర్డర్ లేదని గుర్తించారు. ఎర్రమట్టిని ఆడ్లోడ్ చేసి పంపించేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ, ఎర్రమట్టి గ్రావెల్ తీసుకెళ్లాలంటే తప్పకుండా నిబంధనల ప్రకారం అన్ని రికార్డులు ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది కూడా తమిళనాడు సరిహద్దులో అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ తరలించకుండా చూడాలని ఆదేశించారు. అలా తీసుకెళ్లారని తన దృష్టికి వస్తే సంబంధిత వీఆర్వోలు చర్యలు తప్పవన్నారు.

చంద్రప్రభపై నీలకంఠేశ్వరుడు



ఊరేగుతున్న స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి బుధవారం చంద్రప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం (కార్వేటినగరం): పుట్టిన బిడ్డకు తల్లి పాలు తప్పనిసరిగా పట్టించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ జయశ్రీ అన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శ్రీబొమ్మరాజుపురం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. జయశ్రీతో పాటు హెచ్ఎం శ్యామలమ్మ మాట్లాడారు. తల్లి పాల విశిష్టత, అందులోని పోషకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాధ, జీవిత, కవిత, జీవ ఆయా పాల్గొన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం నుంచి పురవీధుల్లో ర్యాలీ చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, అంగన్వాడీ వర్కర్లు తదితరులు

గజరాజుపై ద్రౌపదీదేవి విహారం





గెరిగ ఊరేగింపు, ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ సమేత అర్జునస్వామి

పుత్తూరు: ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై అర్జునస్వామితో కలిసి అమ్మవారు విహరించారు. భక్తులు కర్పూరహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు మంచినీళ్ల గుంట నుంచి పోతురాజు ముందు నడవగా గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. గెరిగ జలాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఈశ్వరాపురం దళిత సంఘం ఆధ్వర్యంలో గాండీవ రాజసూయ యాగ ఘట్టం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు గెరిగ ఆలయానికి చేరుకోవడంతో ద్రౌపదీ సమేత అర్జునస్వాములను సర్వాంగ సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాత్రి 8 గంటలకు ఊరేగింపు నిర్వహించారు. అ రాత్రి 9 గంటలకు కోవిల్కార్ల ఆధ్వర్యంలో ఖాండవ దహనం కార్యక్రమాన్ని కోలాహలంగా జరిపించారు.